సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



సారథి.. వాహనదారులకు వారధి

ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. - 8లో



విద్యా రంగంలో కొత్త అధ్యాయం..

సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యావకాశాలు అందుతాయని మంత్రి సీతక్క అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.9°/22.9

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహాచండీదేవిగా దుర్గామాత



మహబూబాబాద్ రూరల్ : మానుకోటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాత భక్తులకు శ్రీమహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక దినోత్సవంగా పూజలు జరుగుతున్న నేపథ్యంలో అమ్మవారికి పుస్తకాలతో అలంకరణ చేసి అర్చకులు పూజలు నిర్వహించారు.

రేబిస్ ప్రాణాంతకమైన వ్యాధి



మహబూబాబాద్: రేబిస్ ప్రాణాంతకమైన వ్యాధి అని, కుక్క కాటుకు గురికాకుండా చూసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. పశు వైద్య, సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించి, అనంతరం 58 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. పెంపుడు జంతువులపై పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేబిస్ వ్యాధి ఉన్న కుక్క కరిచిన ప్రాంతంలో దురద, తిమ్మిర్లు, జ్వరం, తలనొప్పి ఇతరత్రా లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు అశోక్, రాజేందర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలు జరిగేతే కఠిన చర్యలు



కురవి: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు, అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కురవి, సీరోలు మండలాల 16వ విడత జాతీయ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ పనుల ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై సమీక్ష చేశారు. సీరోలు ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్యపై డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా గ్రామాల్లో చేసిన పనుల్లో రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను సక్రమంగా చేసి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. సామాజిక తనిఖీకి హాజరుకాని పంచాయతీ కార్యదర్శులపై కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ అధికారి ఆదాం, సత్యం, మహేశ్వర్, మన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, ఏపీఓ యాకాంబ్రం, కురవి ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీఓ భూపాల్ రెడ్డి, ఈసీ కైలా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేసముద్రం మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్దుల బతుకమ్మ, దుర్గాష్టమి, దసరా, గాంధీ జయంతి, వారాంతపు సెలవుల కారణంగా సెలవులు ఇచ్చామని, తిరిగి అక్టోబర్ 6న మార్కెట్ పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

బొగతలో సందడి



వాజేడు: మండల పరిధిలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా వెలిసిన బొగతను చూసేందుకు వచ్చిన పర్యాటకులు జాలువారుతున్న జలపాతాన్ని చూసి ఫిదా అయ్యారు. కొందరు పర్యాటకులు సమీప కొలనులో స్నానాలను చేయగా మరి కొందరు బొగత వద్ద ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు.

పోషకాహారం.. సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ మాసం
- గర్భిణులు, చిన్నారుల పౌష్టికాహారంపై అవగాహన



పోషణమాసంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అధికారులు (ఫైల్)

గూడూరు: మాతా, శిశు మరణాలను తగ్గించడం తోపాటు ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాన్ని ప్రారంభించింది. తద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ.. పోషణ స్థాయిని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో గర్భిణులు, బాలింతలతో సమావేశాలు ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తారు. స్వయంగా అంగన్‌వాడీలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని ఈ మాసంలో వారికి అందిస్తారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు.. అంగన్‌వాడీలు

జిల్లాలో డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూరు మండల కేంద్రాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో మొత్తం 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు, 4355 మంది గర్భిణులు, 2,895 మంది బాలింతలు, 0 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 38,029 మంది ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు మూడేళ్లలోపు పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతంతో పాటు పలు రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా పిల్లల ఎత్తు, బరువు తీసుకొని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఐదేళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్యతోపాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంపూర్ణ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. రోజు ఒక్కొక్కరికి 200 మిల్లీలీటర్ల పాలు, నెలకు 30 గుడ్లు ఇస్తూ మాతా, శిశు ఆరోగ్యాలను కాపాడుతున్నారు.

పోషణ మాసం కార్యక్రమాలు..

- స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పౌష్టికాహారం పదార్థాల వినియోగంపై అవగాహన
- గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పోషణపై సలహాలు, సూచనలు ఇస్తారు. అనుబంధ ఆహార పదార్థాల తయారీ, పోటీలు
- కిశోర బాలికల వైద్య పరీక్షలతోపాటు పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీయడం, ఆహారంలో చక్కెర, నూనె వినియోగం తగ్గించడంపై అవగాహన
- చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులకు అనుబంధ ఆహారంపై పోటీలు, తల్లిదండ్రులతో పోషకాహారంపై ప్రతిజ్ఞ. అంగన్‌వాడీ కేంద్రాల్లో కథలు చెప్పడం, బొమ్మల ప్రదర్శన, వాటి ద్వారా ఈసీసీఈ సెషన్, 0-3 ఏళ్లలోపు పిల్లల ఆరంభ అభివృద్ధి, ప్రేరణ కోసం దృష్టి సారించాల్సిన కార్యక్రమాలు తల్లిదండ్రులతో చేయించడం
- పోషణ లోపం ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, ఆకలి పరీక్షలు, గ్రోత్ మానిటరింగ్
- బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపడం, పిల్లల అనుబంధ ఆహారంపై అవగాహన
- ఆరోగ్యకరమైన అహార అలవాట్లు, జీవనశైలిపై అవగాహన
- స్థానిక వంటకాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, స్వదేశీ బొమ్మల తయారీ
- పోషణ మిషన్ వంద రోజుల ప్రచారం, గ్రామ వార్డు సభలు, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ, గృహ సందర్శన, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత, పలు అంశాలపై అవగాహన కల్పించడం

పోషణ స్థాయిని పెంపొందిస్తాం..



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల పోషణ స్థాయిని పెంపొందించడమే లక్ష్యం. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తాం. మాతా, శిశు మరణాల తగ్గింపునకు కృషి చేయిస్తాం. పోషక విలువలు కల్గిన అహారాన్ని తీసుకునేలా సూచిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, సీమంతాలు, జన్మదిన వేడుకలను కూడా నిర్వహిస్తున్నాం.

- సబిత, జిల్లా సంక్షేమ అధికారి

సద్దులకు సిద్ధం

- బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు
- కొత్త బజారులో బంధం చెరువు, పాత బజారులో నిజాం చెరువులో నిమజ్జనం



నిజాం చెరువు వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ అర్బన్: సద్దుల బతుమక్మ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం మానుకోట పట్టణంలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్టీఆర్ స్టేడియం, పాత బజారులోని నిజాం చెరువు, కొత్త బజారులోని బంధం చెరువును పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ కంట్రోల్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. చెరువుల సమీపంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారు. కాగా జిల్లాలో పలు చోట్ల సోమవారం, కొన్నిచోట్ల మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించుకునే అవకాశం ఉంది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఈ ఉపేందర్, నాయకులు, మున్సిపల్ ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోలాటం ఆడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

- జిల్లా పోలీసు కార్యాలయంలో సందడిగా వేడుకలు

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిధిలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది బతుకమ్మలను సర్వాంగసుందరంగా తయారుచేసి జిల్లా పోలీస్ కార్యాలయానికి తీసుకువచ్చి, బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడిగా వేడుకలు నిర్వహించారు. జిల్లా ప్రజలందరూ సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, మానుకోట, తొర్రూరు డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

875 చెరువుల మత్తడి!

- ఇటీవల కురుస్తున్న వర్షాలతో నిండిన చెరువులు
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల వద్ద బందోబస్తు



మత్తడి పోస్తున్న తాళ్లపూసపల్లి చెరువు

మహబూబాబాద్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలో 875 చెరువులు మత్తడి పోస్తున్నాయి. జిల్లాలో 1,590 చెరువులు ఉండగా.. ఆగస్టులో కొన్ని చెరువులు నిండి మత్తడిపోశాయి. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో మరిన్ని చెరువులు మత్తడి పోస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులను పరిశీలించి నివేదిక అందజేశారు. అలాగే జిల్లాలో ప్రధానంగా ఉన్న పాకాల, మున్నేరు, ఆకేరు వాగులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

జిల్లాలో 1590 చెరువులు..

జిల్లాలోని 18 మండలాల్లో 1,590 చెరువులు ఉన్నాయి. వాటిలో 25 నుంచి 50 శాతం నిండిన చెరువులు 12 ఉన్నాయి. అలాగే 50నుంచి 75 శాతం నిండిన 30 చెరువులు ఉన్నాయి. 75నుంచి 100 శాతం నిండినవి 667 ఉండగా మత్తడి పోస్తున్నవి 875 చెరువులు ఉన్నాయని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారుల సూచనల ప్రకారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఈనెల 26న జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు.

యంత్రాంగం అప్రమత్తం..

భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలతో పాటు ఆకేరు, పాకాల, మున్నేరు వాగులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. వాటి వద్దకు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ అధికారుల కలెక్టర్ అప్రమత్తం చేశారు. దీంతో పాటు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. చేపల వేటకు మత్స్యకార్మికులు వెళ్లకుండా వారికి సమాచారం ఇచ్చారు.

దెబ్బతిన్న చెరువులపై ప్రత్యేక దృష్టి..

ఈమధ్య కాలంలో భారీ వర్షాలతో పలు చెరువులు దెబ్బతిన్నాయి. జిల్లాలో 63 చెరువులు ఎక్కువ దెబ్బతినగా.. 74 చెరువులు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రెండు కాల్వలు కూడా దెబ్బతినగా.. మొత్తం 139 జలవనరులకు సంబంధించిన నివేదిక పంపారు. కాగా 86 చెరువులు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. 14 చెరువుల పనులు జరుగుతున్నాయి. 16 చెరువుల పనులు పూర్తి కాలేదు. 23 చెరువుల మర్మతుల పనులు మంజూరు కాలేదని అధికారులు తెలిపారు. దీంతో దెబ్బతిన్న చెరువుల పరిస్థితిపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. చెరువుల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మండలాల వారీగా చెరువుల పరిస్థితి

మండలం	చెరువులు	75-100 శాతం నిండినవి	మత్తడి పోస్తున్నవి
మానుకోట	87	03	84
గూడూరు	122	87	35
చిన్నగూడూరు	24	13	07
దంతాలపల్లి	29	21	07
డోర్నకల్	69	-	69
మరిపెడ	67	30	37
నర్సింహులపేట	46	28	18
సీరోలు	48	-	48
కురవి	76	-	76
నెల్లికుదురు	58	19	19
కేసముద్రం	53	03	48
ఇనుగుర్తి	28	07	15
గార్ల	96	29	67
బయ్యారం	98	60	38
తొర్రూరు	58	18	26
పెద్దవంగర	37	8	28
కొత్తగూడ	380	251	129
గంగారం	214	90	124
మొత్తం	1,590	667	875

బాధితులకు భరోసా కల్పించాలి



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సైలు

వరంగల్ క్రైం: పదోన్నతులతో బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎం.సాంబరెడ్డి, పి.జైపాల్, పి.లక్ష్మారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, ఎం.సాంబయ్య, కె.వెంకన్న, డి.సమ్మిరెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్ రాజు, ఎస్.సదయ్య ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు భరోసా, నమ్మకాన్ని కలిగించాలని, నిరుపేద ప్రజలకు పోలీసు అధికారులు అండగా నిలవాలని పదోన్నతి పొందిన ఎస్సైలకు సూచించారు.

వలసవాదులం కాదు.. మూలవాసులం

- లంబాడీలు ఐకమత్యంతో రాజ్యాధికారం సాధించాలి
- ఆదివాసీ, లంబాడీల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు
- లంబాడీల ఆత్మగౌరవ సభలో నేతలు



లంబాడీల ఆత్మగౌరవ సభలో అభివాదం చేస్తున్న నాయకులు



సభలో నృత్యం చేస్తున్న మహిళలు



సభకు హాజరైన లంబాడీలు

నెహ్రూసెంటర్: లంబాడీలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలసవాదులుగా చిత్రీకరించేందుకు కొందరు పనిగట్టుకుని కుట్రలు చేస్తున్నారని, మేము వలసవాదులం కాదు.. మూలవాసులమని గిరిజన నేతలు పేర్కొన్నారు. లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడూ.. ఆదివాసీ, లంబాడీల మధ్య చిచ్చు పెట్టేలా కుట్రలు చేస్తున్నారని ఆదివాసీల భుజాలపై తుపాకీ పెట్టి లంబాడీలను కాల్చేలా పతకం వేస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ, లంబాడీల హక్కుల కోసం కలిసి పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. కొంత మంది జాతి కోసం పోరాటం చేస్తే ఫలాలు పొందుతున్నాం. లంబాడీలను రెచ్చగొట్టి ఇబ్బంది పెట్టేలా ఎవరు చేసినా.. కాలగర్భంలో కలిపేలా కలిసికట్టుగా ఉండాలి. రాజకీయ అవకాశాలు వస్తే ఒక్కతాటిపై ఉండి జాతి కోసం నిలబడాలని, ఈ ఉద్యమంలో మీతో ఉంటానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జాతి కోసం జరుగుతున్న పోరాటంలో లంబాడీ ప్రజాప్రతినిధులు కలిసి రావాలన్నారు. రిజర్వేషన్ల కోసం, తండాలను గ్రామ పంచాయతీల కోసం పోరాటాలు చేసి సాధించుకున్నాం. పాలకులు రెచ్చగొట్టి కలిసి ఉన్న ఆదివాసీ, లంబాడీల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారన్నారు. జాతికోసం అందరూ ఐక్యమవుదాం, పార్టీలకు అతీతంగా కలిసివచ్చి రాజ్యాధికార సాధనలో ముందుండాలన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వాలపై పోరాడి హక్కులు సాధించుకోవాలే తప్ప లంబాడీలను రాజకీయం కోసం వాడుకోవాలని చూస్తే వారిని రాజకీయ భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సేవాలాల్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ మాట్లాడుతూ.. రాజకీయాలను పక్కన బెట్టి జాతి మనుగడ సాధించేలా, రాజ్యాధికారం కోసం లంబాడీలంతా ఏకం కావాలన్నారు. హక్కులు, చట్టాలు సాధించుకునేలా పోరాటాలు సాగించాలని, రిజర్వేషన్ కాపాడుకునేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఎస్టీ జాబితా నుంచి తప్పించే కుట్రలను తిప్పికొట్టేలా ప్రతి ఒక్కరూ పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చా రు. జేఏసీ చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్, వైస్ చైర్మన్ గుగులోత్ కిషన్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో దారావత్ వెంకన్ననాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, గుగులోత్ భీమానాయక్, బోడ రమేష్‌నాయక్, డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, హత్యానాయక్, డాక్టర్ వివేక్, హరినాయక్, మంగీలాల్, గుగులోత్ రవి, చందులాల్, సిద్ధునాయక్, కర్నావత్ వెంకన్న, మాలోత్ రవీందర్, లింగ్యానాయక్ ఉన్నారు.

పట్టుదలతో ప్రభుత్వ కొలువు సాధించారు..

- గ్రూప్-2 ఉద్యోగం సాధించిన పలువురు జిల్లా వాసులు

జిల్లాకు చెందిన పలువురు గ్రూప్-2 ఉద్యోగం సాధించారు. ఆదివారం టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో సత్తా చాటారు. పట్టుదలతో చదివి లక్ష్యాన్ని ముద్దాడారు.

ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు



శిరీష్

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన దిగోజ్ శిరీష్ గ్రూప్-2 ఫలితాల్లో ఆబ్కారీ ఎస్సైగా కొలువు సాధించాడు. కాగా ఆయన పంచాయతీ కార్యాదర్శిగా విధులు నిర్వహిస్తూనే.. గ్రూప్-4 లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం హనుమకొండ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఆబ్కారీ ఎస్సైగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా ముల్కలపల్లి వాసి



మేకల ఉపేందర్

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లికి చెందిన మేకల ఉపేందర్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గ్రూప్-2లో ఫలితాల్లో సబ్ రిజిస్ట్రార్‌గా కొలువు సాధించాడు. ఇప్పటికే ఆయన మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఏఎస్ఓ ఉద్యోగం సాధించిన మౌనిక



తల్లిదండ్రులతో మౌనిక

గార్ల: మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన బోడ మౌనిక గ్రూప్-2 ఫలితాల్లో హైదరాబాద్ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) ఉద్యోగం సాధించింది. బోడ హరిలాల్ కూతురు మౌనిక గ్రూప్-2లో ఎస్టీ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించింది. ఆమెను గ్రామస్తులు అభినందిచారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నరేందర్



నరేందర్

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన నరేందర్ గ్రూప్-2లో ప్రతిభ కనపరిచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపిక య్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నరేందర్ ఇప్పటికే సంగ్రాయిగూడెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు.

ఏఎస్ఓగా ఎంపికైన ప్రణీత్ కుమార్



చెన్న ప్రణీత్

పెద్దవంగర: మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన చెన్న ప్రణీత్ కుమార్ గ్రూప్-2 ఫలితాల్లో 138 ర్యాంక్ సాధించి ఏఎస్ఓగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు చెన్న సోమనారాయణ-నాగలక్ష్మి వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. వ్యవసాయం చేస్తూ తమ కుమారుడికి ఉన్నత విద్యను అందించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాడు.

ఎక్సైజ్ ఎస్సైగా పోలారం వాసి



యాకూబ్

కొత్తగూడ : మండలంలోని పోలారం గ్రామానికి చెందిన భూక్య యాకూబ్ గ్రూప్-2లో ప్రతిభ చాటి ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన యాకూబ్ ఎలాంటి అదనపు శిక్షణ లేకుండా నేరుగా గ్రూప్-2 పరీక్షలు రాని మొదటిప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాడు. కాగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సారథి.. వాహనదారులకు వారధి

ఇంటి నుంచే డ్రైవింగ్‌ లైసెన్స్‌లు

- ఉమ్మడి జిల్లాలో అందుబాటులోకి పోర్టల్‌
- దేశవ్యాప్తంగా ఒకే పోర్టల్‌.. ఒకే లైసెన్స్‌ విధానం అమలు
- రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేనే డ్రైవింగ్‌ లైసెన్స్‌
- త్వరలోనే ఆర్టీఏలో దళారుల వ్యవస్థ కనుమరుగు


వరంగల్‌ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్‌ : రవాణా శాఖలో సంస్కరణల శకం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న వాహన్‌ వెబ్‌సైట్‌లోని డేటాబేస్‌తో రవాణాశాఖ అనుసంధానమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్‌ విధానాన్ని ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. వరంగల్‌, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్‌ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో సారథి పోర్టల్‌ అమలుకు ఆగస్టు 18 తేదీన శ్రీకారం చుట్టారు. పోర్టల్‌లో తలెత్తుతున్న స్వల్ప సాంకేతిక ఇబ్బందులను దశల వారీగా సవరణ చేశారు. ప్రస్తుతం పోర్టల్‌లో నమోదు ప్రక్రియ విజయవంతమవుతోంది. ఇప్పటి వరకు సిటిజన్‌ ఫ్రెండ్లీ సర్వీస్‌ ఇన్‌ ట్రాన్స్‌పోర్ట్‌ డిపార్ట్‌మెంట్‌(సీఎఫ్‌ఎస్టీ) పోర్టల్‌ పనిచేయగా ఇకపై దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తున్న పరివాహన్‌ ద్వారా సేవలు అందనున్నాయి. ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు పారదర్శకంగా అందుతున్నాయి.

విదేశాల నుంచైనా అవకాశం..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సారథి పోర్టల్‌ ద్వారా దేశ, విదేశాల నుంచైనా ఆన్‌లైన్‌లోనే ఇంటి నుంచి లైసెన్స్‌ తీసుకునే అవకాశం ఉంటుంది. రోడ్డు భద్రతపై పరిజ్ఞానం ఉంటే సులభంగా పరీక్ష ఉత్తీర్ణత కావొచ్చు. కాగా, సారథి పోర్టల్‌తో ఇంటి నుంచే లెర్నింగ్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌లు పొందడం, రెన్యువల్‌, చిరునామా మార్పు వంటి అంశాలకు వీలు కల్పించనున్నారు. ప్రస్తుతం పోర్టల్‌ ద్వారా లైసెన్స్‌ తీసుకునే అవకాశం మాత్రమే కల్పించారు. అంతర్జాతీయ డ్రైవింగ్‌ లైసెన్స్‌లు తీసుకొని విదేశాలకు వెళ్లిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించక అక్కడి అధికారులు వాటిని తిరస్కరించిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్‌ పెట్టొచ్చని ఎంవీఐలు భావిస్తున్నారు. కొత్త విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్‌ బుకింగ్‌, వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం వచ్చిన తర్వాత కొంత ఆలస్యం అవుతోంది. కొన్నాళ్లకు త్వరిగతిన సేవలు అందుతాయని అధికారులు అంటున్నారు. వాహనదారులు rarathiparivahan.gov.in / rarathirervicerలో స్లాట్‌ బుక్‌ చేసుకోవచ్చు.

ఇండియాలో ఒకే విధానం..

పరివాహన్‌ సారథి పోర్టల్‌ ద్వారా పొందిన లైసెన్స్‌ ఇండియాలో ఎక్కడైనా చెల్లుబాటు అవుతుంది. రెన్యువల్‌ టైంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంది. ఈకార్డు కాశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు చెల్లుబాటు అవుతుంది. ఇంతకాలం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలోనే లైసెన్స్‌ ఉండేది. వివరాలు మరో రాష్ట్రంలో కనిపించేవి కాదు. అంతా గోప్యంగా ఉండేది. కానీ ప్రస్తుతం నూతనంగా వచ్చిన పరివాహన్‌ సారథి పోర్టల్‌ ద్వారా క్షణాల్లో వాహనదారుడి వివరాలు చేతికి వస్తాయి.

కనిపించని లైసెన్స్‌ కార్డు..



పరివాహన్‌ సారథి పోర్టల్‌లో లైసెన్స్‌ పొందిన వాహనదారుడికి కార్డు చేతికి రాదు. వాహనదారుడు డీఎల్‌ పరీక్ష రాయగానే ఆన్‌లైన్‌లోనే కార్డును డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. ప్రత్యక్షంగా కార్డు ఇచ్చేది ఏమీ ఉండదు. ఫోన్‌కు వచ్చిన లింక్‌ ఓపెన్‌ చేస్తే కార్డు మీ మొబైల్‌లోనే డౌన్‌లోడ్‌ అవుతోంది. తనిఖీ సమయాల్లో ఆర్టీఏ, పోలీస్‌ అధికారులు పోర్టల్‌లో డౌన్‌ లోడ్‌ చేసుకున్న కార్డును చూపిస్తే సరిపోతోంది.

సారథి పోర్టల్‌తోనే సేవలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లర్నింగ్‌ లైసెన్స్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌ జారీ సారథి పోర్టల్‌ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 18న ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈనెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఎల్‌ఎల్‌, డీఎల్‌లు అందజేస్తున్నాం. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు అధిగమించి సేవలు అందిస్తున్నాం.

జి. సురేశ్‌ రెడ్డి డీటీసీ, హనుమకొండ, వరంగల్‌

దళారుల వ్యవస్థ ఇక కనుమరుగు

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో వాహనదారులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇంతకాలం ఆర్టీఏలో డ్రైవింగ్‌ లైసెన్స్‌తోపాటు లర్నింగ్‌ లైసెన్స్‌ కావాలన్నా ఎంతో కొంత ముట్టచెప్పాల్సి వచ్చేది. సారథి పోర్టల్‌ అందుబాటులోకి రావడంతో నిదానంగా ఈ అవినీతి తగ్గుముఖం పడుతోంది. ఆర్టీఏ సేవలు ఇక సులభంగా పొందే అవకాశం ఉన్నా.. చదువుకున్న వ్యక్తికే డ్రైవింగ్‌ లైసెన్స్‌ జారీ అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వాహనదారులు రవాణా సేవలు పొందే వెసులు బాటు వచ్చింది. ఆన్‌లైన్‌లో పరిజ్ఞానం ఉంటే లర్నింగ్‌ లైసెన్స్‌ పరీక్ష సులభతరంగా ఉంటుందని రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్స్‌లకు ధ్రువీకరణ పత్రాల హార్డ్‌ కాపీ జత చేయాల్సి వస్తోంది. కొత్త విధానంలో సాఫ్ట్‌ కాపీతో సరిపోతుంది. వరంగల్‌ ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 18 నుంచి పరివాహన్‌ సారథి ద్వారా సేవలు అందిస్తున్నారు. రోజుకు 430 మందికి ఆన్‌లైన్‌లో వివిధ లైసెన్స్‌లకు స్లాట్స్‌ అందుబాటులో ఉన్నాయి.

విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి ధనసరి సీతక్క


ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: సమ్మక్క, సారలమ్మ సెంట్రల్‌ యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయని, విద్యారంగంలో ఈ యూనివర్సిటీ కొత్త అధ్యాయం సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పరిధిలోని సాయిబాబా టెంపుల్‌ రోడ్‌ శివారులో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్‌ ట్రైబల్‌ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణ పనులను మహబూబాబాద్‌, ఆదిలాబాద్‌ ఎంపీలు పోరిక బలరాం నాయక్‌, జి.నాగేశ్‌, కలెక్టర్‌ దివాకర టీ.ఎస్‌, వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ వైఎల్‌.శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ ట్రైబల్‌ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని, యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు సమకూర్చుతామని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ బానోత్‌ రవిచందర్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రేగ కల్యాణి, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మూడేళ్ల ‘లా’ ఐదో సెమిస్టర్‌ సప్లిమెంటరీ

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల ‘లా కోర్సు ఐదో సెమిస్టర్‌ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్‌ 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్‌ తెలిపారు. 8న మొదటి పేపర్‌, 10న రెండో పేపర్‌,14న మూడో పేపర్‌, 16న నాలుగో పేపర్‌, 18న ఐదో పేపర్‌ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

స్కాన్‌ చేస్తే ఆలయ చరిత్ర


ఆలయ ఆవరణలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్‌ స్కానర్‌

హన్మకొండ చౌరస్తా: చారిత్రక వేయిస్తంభాల ఆలయ చరిత్రను తెలుసుకునేందుకు ఇక గైడ్‌ అవసరం లేదు. ఆలయ చిత్రాలు, చరిత్రను క్షుణ్ణంగా వివరించేలా పురావస్తు శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో క్యూఆర్‌ స్కానర్లను ఏర్పాటు చేశారు. గూగుల్‌ క్రోమ్‌ లోకి వెళ్లి స్కాన్‌ చేస్తే చాలు చరిత్ర తెలియజేస్తుంది.









పద్మశాలీలు ఉన్నత శిఖరాలకు చేరాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న శామంతుల శ్రీనివాస్‌

హన్మకొండ: పద్మశాలి కులస్తులు ఉన్నత శిఖరాలకు చేరాలని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి అన్నారు. పద్మశాలి అఫీషియల్స్‌ అండ్‌ ప్రొఫెషనల్స్‌ అసోసియేషన్‌ (పోపా) ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో ముందుకు పోతే లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. గ్రూప్స్‌, సివిల్స్‌లో పద్మశాలీలు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారన్నారు. రాజకీయాల్లోనూ రాణించాలని సూచించారు. పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే సాధించలేనిదంటూ ఉండదన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పోపా ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్‌ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంఘం లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్‌ కూరపాటి రమేశ్‌, సీనియర్‌ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పద్మశాలి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్‌, పాము శ్రీనివాస్‌, గోషికొండ సుధాకర్‌, బైరి శ్యాంసుందర్‌, మాటేటి అశోక్‌, సంతోష్‌, ధర్మపురి రాజగోవింద్‌, దిడ్డి అనిల్‌, బత్తుల సత్యం, వంగరి వేణు, గుండేటి సతీశ్‌, కందకట్ల రాకేశ్‌, వడ్నాల సత్యనారాయణ, గుండు రవి, డాక్టర్‌ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీశ్‌, వైద్యం రాజగోపాల్‌, డాక్టర్‌ కూరపాటి రాధిక, డాక్టర్‌ అంబటి అజయ్‌, మోతె రాజకుమార్‌, శ్రీరాముల శ్రీనివాస్‌, డాక్టర్‌ చింతకింది శ్రీనివాస్‌, విటోభా పాల్గొన్నారు.

బాలికలు, మహిళలకు జిల్లా స్థాయి చెస్‌పోటీలు


చెస్‌ ఆడుతున్న బాలికలు, మహిళలు

విద్యారణ్యపురి : ధర్మసాగర్‌ చెస్‌ నెట్‌వర్క్‌ క్లబ్‌, దండేపల్లి క్లబ్‌, ముప్పారం క్లబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో బాలికలు, మహిళలకు వరంగల్‌ జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకురాలు గుంటి స్వప్న ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలు బాలబాలికలు, మహిళల్లోని ప్రతిభ వెలుగులోకి రావడానికి దోహదపడుతాయన్నారు. అనంతరం న్యూరో సెకియాట్రిస్ట్‌ జగదీశ్‌బాబు మాట్లాడుతూ చదరంగం జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ మానసిక శక్తిని వ్యూహాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తుందన్నారు. చీఫ్‌ ఆర్బటర్‌ రజనీకాంత్‌, ఆర్బిటర్‌ శివ , ధర్మసాగర్‌ చెస్‌క్లబ్‌ కార్యదర్శి శ్రీనివాస్‌ ఈపోటీలను సమన్వయం చేశారు. సెయింట్‌ పీటర్స్‌ విద్యా సంస్థల అధినేత నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజనీర్‌ పొన్నాల రామయ్య, వరంగల్‌ నిట్‌ ఆచార్యులు ఆనంద కిశోర్‌, విశ్రాంత ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌, విశ్రాంత ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, చెస్‌క్లబ్‌ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరామోజీ,హెచ్‌ఎం ధర్మ పాల్గొన్నారు.

బతుకమ్మ అంటేనే పూల పండుగ


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్‌ సుధారాణి, అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి, బల్దియా కమిషనర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌


బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఖుష్‌మహల్‌ మైదానంలో అంబరాన్నంటిన సంబురాలు

ఖిలా వరంగల్‌: బతుకమ్మ అంటేనే పూల పండుగ అని, బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్‌ తూర్పు నియోజకవర్గంలోని చారిత్రక మధ్యకోట ఖుషిమహాల్‌ మైదానంలో అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి, బల్దియా కమిషనర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచేలా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ కాదని, ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని చెప్పారు. అనంతరం మేయర్‌ గుండు సుధారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. నగర ప్రజల కోసం 29,30 తేదీల్లో సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో ఏర్పాట్లు చేశామని, 16 ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, పోశాల పద్మ, పల్లం పద్మ, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్‌, శ్రీకాంత్‌, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కటాక్షపూర్‌ చెరువు మత్తడి


మత్తడి పోస్తున్న కటాక్షపూర్‌ చెరువు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్‌ చెరువు మత్తడి పెరిగింది. జాతీయ రహదారి–163పై ఉన్న మత్తడి ప్రవాహం పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. లారీలు వెళ్లకుండా గూడెప్పాడ్‌ నుంచి మళ్లించారు. కార్లను శాయంపేట మీదుగా మళ్లించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

భూమి కావలెను

భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716.

[SCA25008551]

SERVICES

CHANGE OF NAME

I, MD. CHARISHMA, D/o. MOHAMMED ANKOOS, AHMED (Old Name), R/o. H.No.2-7-115, Bhavani Nagar, NGO's Colony, Hanumakonda District, Telangana State - 506001, India. I have changed my name as MOHAMMED CHARISHMA, D/o. MOHAMMED ANKOOS AHMED (New Name) for all future purposes.

[SCA25008573]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్‌ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్‌ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్‌ : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెరుగుతూ.. తగ్గుతూ..


వాజేడు- గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్య రహదారిపై వరద

- గోదావరి వరద ఉధృతి


ముంపునకు గురైన జాతీయ రహదారి

వాజేడు: గోదావరి దోబూచులాడుతోంది. శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఉధృతంగా పెరిగిన గోదావరి వరద 2 గంటల పాటు నెమ్మదించింది. సాయంత్రం 4 నుంచి మళ్లీ పెరుగుతూ రహదారులను ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు 15.890 మీటర్ల మేర పెరిగింది. టేకులగూడెం గ్రామ చివరిలోని జాతీయ రహదారి మళ్లీ ముంపునకు గురి కావడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పల్లపు ప్రాంతాల నుంచి గోదావరి ప్రవహిస్తుండటంతో మిర్చి పంటలు ఇంకా నీటిలో మునిగి ఉన్నాయి.

సమ్మక్కసాగర్‌లోకి భారీగా వరద నీరు

కన్నాయిగూడెం: నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఎగువన ఉన్న బ్యారేజీల నుంచి గోదావరిలోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో మండల పరిధిలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్‌ బ్యారేజీలోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంతో ప్రవహిస్తోంది. ఈ మేరకు బ్యారేజీలోకి ఆదివారం 7,78,600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీకి ఉన్న 59గేట్లను ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు.

వేడివేడి.. టేస్టీ టేస్టీగా



వానాకాలం, చలి కాలాల్లో ఎక్కువగా మొక్కజొన్న కంకులకు గ్రేటర్‌ వరంగల్‌ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాలు, రహదారుల పక్కన విక్రయిస్తు ఉంటారు. రోడ్లకు ఇరువైపులా కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులను ప్రయాణికులు కొనుగోలు చేసి తింటుంటారు. అడ్డా కూలీలు, కొందరు రైతులు మొక్కజొన్న పొత్తులను నగరానికి తీసుకొచ్చి విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

- కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులకు భలే డిమాండ్‌

కాజీపేట : ట్రై సిటీలోని అనేక ప్రాంతాల్లో ఉడకబెట్టిన, కాల్చిన కంకులు తినడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్టాండులలో తోపుడుబండ్లపై కాల్చిన, ఉడకబెట్టిన మొక్క జొన్న కంకులను విక్రయిస్తూ చిరు వ్యాపారులు, కొందరు రైతులు, మరికొందరు అడ్డా కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఈ సీజన్‌లో మక్క కంకుల విక్రయం జోరుగా సాగుతోంది.

కంకులకు భలే డిమాండ్‌.

నగరంలో దాదాపు 50కి పైగా ప్రాంతాల్లో చిన్న బొగ్గుల పొయ్యి ఏర్పాటు చేసుకొని కాల్చిన మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్నారు. ప్రతీ ఏటా వేడి వేడి మొక్కజొన్న కంకులకు ఆదరణ పెరగడంతో కాల్చి విక్రయించే కేంద్రాలు పెరిగిపోతున్నాయి. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో మొక్కజొన్న కంకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, ఉడకబెట్టి కంకులను విక్రయిస్తున్నారు. రూ.15నుంచి రూ.20లకు ఒక కంకి చొప్పున అమ్ముతున్నారు.


కాజీపేట రైల్వే స్టేషన్‌ పరిధిలో కంకులు కాల్చుతున్న మహిళ

మొక్కజొన్న కంకులు ఇష్టం



వానాకాలం, చలికాలాల్లో కాల్చిన కంకులు తినడం అంటే ఎంతో ఇష్టం. రహదారిపై ఆగి మరి కొని తింటా. పచ్చి కంకుల ధరకన్నా కాల్చినా, ఉడక బెట్టిన కంకులకు నాలుగు పైసలు ఎక్కువే. అయినా అమ్మకందారుల శ్రమను గుర్తించాలి.

- కుమ్మరి రాజ్‌కుమార్‌, సోమిడి

బస్తీబస్తీ తిరుగుతూ...

రెండేళ్ల నుంచి తోపుడు బండ్లపై మొక్కజొన్న కంకుల విక్రయాలు పెరుగుతున్నాయి. సాధారణంగా పొట్టు తీసి కాల్చడం కంటే పొట్టుతో సహా కాలిస్తే గింజలు మరింత రుచిగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జూలై నుంచే మక్క కంకులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా..

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా మొక్కజొన్న కంకులను విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న కంకులను వ్యవసాయ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్‌ నగరంలోని ప్రత్యేక అడ్డాల్లో కంకులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించడం వల్ల కొంత లాభం వస్తున్నప్పటికీ ట్రాఫిక్‌ పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పడంలేదని వారు ఆవేదన చెందుతున్నారు.